

నేడు చేవెళ్లకు ఈటల రాజేందర్ రాక

చేవెళ్ల, ఫిబ్రవరి 14 : వివిధ పార్టీల నేతలు బీజేపీలో చేరుతున్న సందర్భంగా నేడు ఆ పార్టీ నిర్వహించే సమావేశంలో పాల్గొనేందుకు పార్టీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ చేవెళ్లకు రానున్నట్టు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని చెప్పారు. సమావేశానికి మాజీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం హాజరు కానున్నారని చెప్పారు. చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు బీజేపీలో చేరుతున్నారని చెప్పారు.



అక్షరాభ్యాసం చేయించేందుకు వచ్చిన తల్లిదండ్రులు.. (ఇన్‌సెట్‌లో) చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న శ్రీహంపి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి

ఏకాగ్రత, చిత్తశుద్ధితో ఏ పని చేసినా విజయవంతమే

శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి

యాచారం, ఫిబ్రవరి 14 : సమాజ హితం కోసం ఏ కార్యక్రమం చేపట్టినా ఏకాగ్రత, చిత్తశుద్ధి చాలా ముఖ్యం. జ్ఞాపకశక్తి పెరగాలంటే యోగా ధ్యానం చాలా ముఖ్యమని శ్రీహంపి విరూపాక్ష విద్యారణ్య భారతిస్వామి అన్నారు. వసంత పంచమిని పురస్కరించుకొని బుధవారం యాచారం మండలం నందివనపర్తిలోని శ్రీ జ్ఞానసరస్వతీ మాత ఆలయంలో ధ్వజారోహణం చేశారు. అనంతరం హోమం నిర్వహించి 350 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా విద్యారణ్య భారతిస్వామి మాట్లాడుతూ శ్రీజ్ఞాన సరస్వతి సేవా సమితి పేద విద్యార్థుల ఉన్నతికి పాటు పడడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కేవలం నందివనపర్తిలోనే విద్యార్థుల చందాలతో శ్రీ జ్ఞాన సరస్వతి మాత ఆలయం నిర్మాణం చేయడం, అమ్మవారి అలంకరణ చేయడం ప్రశంసనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జన్మనిచ్చిన అమ్మానాన్నలు, విద్యాబుద్ధులు నేర్పిన గురువుల మేలు విస్మరించరాదన్నారు. భవిష్యత్తులో ఉన్నతిలోకి వచ్చిన తరువాత గ్రామాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ విద్యార్థి రోజూ గంట పాటు యోగా ధ్యానం చేసుకోవాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీజ్ఞాన సరస్వతి ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డి, సమన్వయ మండలి సభ్యులు సంగం గణేష్, జలంధర్‌రెడ్డి, సంతోష్, కుమార్, వెంకటరెడ్డి, రాఘవేందర్ శర్మ, మాతృమండలి సభ్యులు రుద్రమ్మ, దీపిక, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కలిసి నడుస్తాం

మాజీ ఎమ్మెల్యేలు కేఎల్ఆర్, తీగల కృష్ణారెడ్డి



మహేశ్వరం, ఫిబ్రవరి 14 : రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం కలిసి పనిచేయడంతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలో చెరువులు, కుంటలు, అసైన్డ్, ప్రభుత్వ భూముల ఆక్రమణపై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని మాజీ ఎమ్మెల్యేలు కేఎల్ఆర్, తీగల కృష్ణారెడ్డిలు తెలిపారు. మంగళవారం రాత్రి మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కేఎల్ఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తాను, తన కోడలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డితో పాటు త్వరలో అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నానని చెప్పారు. తదనంతరం నియోజకవర్గంలో జరిగిన అవినీతి అక్రమాలపై అలుపెరుగని పోరాటం చేరబోతున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా నియోజకవర్గంలో కబ్జాలకు గురైన చెరువులు, కుంటలతో పాటు ప్రభుత్వ భూములను పరిశీలించేందుకు మంత్రుల బృందం పర్యటించనుందన్నారు. ముఖ్యంగా జిల్లా అభివృద్ధి కోసం కేఎల్లార్‌తో కలిసికట్టుగా పని చేస్తామని, ముఖ్యంగా త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కలిసి పనిచేస్తామని చెప్పారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్




నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మురహరి

ఆమనగల్లు , ఫిబ్రవరి 14 : ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎంగళి ప్రసాద్ నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుద్దార మురహరి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి కార్మికులు, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని ప్రసాద్ చెప్పారు. తన నియామకానికి సహకరించిన ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీ చంద్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, సంయుక్త కార్యదర్శి కుషాల్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు శరణ్యారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్మదారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సత్యం పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. నిన్న మొన్నటి వరకున్న అసెంబ్లీ ఎన్నికల వేడి తగ్గుతున్న తరుణంలో లోక్‌సభ ఎన్నికలు మళ్లీ రాజకీయ వేడిని రగిలిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో విజయ పరంపర సాగించి అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచుతోంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌ను కోలుకోలేని విధంగా దెబ్బకొట్టేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఇప్పటికే చేరికలకు సంబంధించిన బాధ్యతలను కొందరు ముఖ్యనేతలకు అప్పగించింది. పార్లమెంట్ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వరుసగా జరిగే అవకాశం ఉండడంతో వీటిని దృష్టిలో పెట్టుకుని చేరికలపై ఫోకస్ పెంచారు.

మారిన వ్యూహం!

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ ఫోకస్



కామ్‌గా బీఆర్ఎస్ ముఖ్యనేతలు

బీఆర్ఎస్‌పై ముప్పేట దాడికి సిద్ధమవుతున్న కాంగ్రెస్ వారం, పది రోజుల్లోనే గులాబీకి భారీ షాక్ ఇవ్వనున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ ముఖ్యనేతలు కూడా కొద్ది రోజులుగా కామ్‌గా ఉండడం చూస్తే ఆ పార్టీలో ఏదో జరుగుతుందనే ప్రచారానికి బలం చేకూరుస్తోంది. ఇటీవల మాజీ మంత్రి మల్లారెడ్డి కూడా తాను త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తానని కీసర ఆలయానికి ఆహ్వానిస్తానని పేర్కొవడం గమనార్హం. అలాగే ఆయన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. రంజిత్‌రెడ్డి చేవెళ్ల ఎంపీ కాంగ్రెస్ టికెట్ కోసం ఖర్చీఫ్ వేసినట్లు తెలియడంతోనే మహేందర్‌రెడ్డి జాగ్రత్తపడ్డారని చెప్పారు. అప్రమత్తమైన మహేందర్‌రెడ్డి ఆగమేఘాలపై సీఎం రేవంత్‌ను కలిశారని చెప్పడం రాజకీయకలకలం రేకెత్తించింది. దీన్ని రంజిత్‌రెడ్డి కూడా ఇంతవరకూ ఖండించకపోవడం గమనార్హం.

- బీఆర్ఎస్‌పై ముప్పేట దాడికి ప్రణాళిక
- జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలపై దృష్టి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో మంతనాలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రాజకీయ పరిణామాలు అనూహ్యంగా మారుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు సమయాత్తమవుతున్న కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు ఆపార్టీ ప్రధాన నేతలను తమ వైపు తిప్పుకునేందుకు ఓవైపు ప్రయత్నాలు చేస్తూనే మరో వైపు క్షేత్రస్థాయిపై ఎక్కువ ఫోకస్ మొదలు పెట్టింది. బీఆర్ఎస్‌కు చెందిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు. మున్సిపల్, కార్పోరేషన్ చైర్మన్లను పెద్ద సంఖ్యలో చేర్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌ను కోలుకోలేని విధంగా దెబ్బకొట్టాలని భావిస్తున్న కాంగ్రెస్ చేరికలకు సంబంధించిన బాధ్యతలను కొందరు ముఖ్యనేతలకు అప్పగించినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో వీరు జడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్, కార్పోరేషన్ చైర్మన్లతో వరుస భేటీలవుతున్నట్లు తెలిసింది.

వలసల జోరు

పార్లమెంట్ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వరుసగా జరిగే అవకాశం ఉండడంతో వీటిని దృష్టిలో పెట్టుకుని చేరికలపై ఫోకస్ పెంచారు. ఇప్పటికే మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. త్వరలో వీరితో పాటు వారి అనుచరులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీని కలిసిన తరువాత స్థానికంగా బహిరంగ సభలు నిర్వహించి అనుచరవర్గంతో కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఇదిలా ఉంటే మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి తనతో పాటు కొందరు ఎమ్మెల్యేలను కూడా కాంగ్రెస్‌లో తీసుకువెళ్లేందుకు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో తన సహచరులుగా ఉన్న ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి రప్పించేందుకు ఇప్పటికే ఆయన రంగంలో దిగారు. కాంగ్రెస్‌లో చేరేందుకు కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సానుకూలంగా ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో కూడా ఆయన చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది.

ఆ మూడు కుటుంబాలతో మారిన రాజకీయం





ఉమ్మడిజిల్లాలో రాజకీయ పరిణామాలు అనూహ్యంగా మారుతున్నాయి. మూడు రాజకీయ కుటుంబాలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ వైపు రావడంతో రాజకీయాలు కొత్త మలుపులు తిరగడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆయన కుమారుడు, మేడ్చల్ జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల ఫలితాల అనంతరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. తీగల కృష్ణారెడ్డి కోడలు, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. తనతో పాటు తన కోడలు అనితారెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తీగల ఇటీవల ప్రకటించారు. ఇదిలా ఉంటే తాజాగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడి తన భార్య, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి ఆమె కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగే అవకాశాలు ఉన్నాయి. ఇలా మూడు రాజకీయ కుటుంబాలకు చెందిన వారు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో మూడు జిల్లా పరిషత్‌లు త్వరలో కాంగ్రెస్ పరంకానున్నాయి.

'ప్రాణహిత-చేవెళ్ల'ను పునరుద్ధరించాలి

- ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

చేవెళ్ల, ఫిబ్రవరి 14 : ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించి చేవెళ్ల ప్రాంతానికి గోదావరి నీటిని తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేవెళ్ల మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 75లో పేదలు గుడిసెలు వేసుకొని ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చాడ వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం పేదలను విస్మరించి కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం దారుణమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కక్షపూరితంగానే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును నిర్వీర్యం చేసి చేవెళ్ల ప్రాంతానికి తీరని అన్యాయం చేసిందన్నారు. కేసీఆర్ తీసుకొచ్చిన జీవో నెంబర్ 58 వల్ల పేదలకు పట్టాలు ఇవ్వలేకపోయారని, ఆ జీవో క్రమబద్ధీకరణతో ఆక్రమణదారులకు లాభం జరిగిందన్నారు. కేసీఆర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ప్రాణం తీశారని వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు తిరిగి జీవం పోయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్న నమ్మకం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు న్యాయం చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చే వరకూ సీపీఐ పోరాటం కొనసాగిస్తుందన్నారు. కేసీఆర్ తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే నల్లగొండలో సభ ఏర్పాటు చేశారని ఆరోపించారు. మేడిగడ్డలో నిర్మించిన ప్రాజెక్టు నిర్మాణంలో బ్రిడ్జి కుంగిపోవడానికి కారణకులు ఎవరైనా వదిలిపెట్టొద్దని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం తక్షణమే మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్మాకుల జంగయ్య మాట్లాడుతూ చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 75లో నాలుగు ఎకరాల్లో 700 మంది ఇళ్లు లేని పేదలు గుడిసెలు వేసుకున్నారని, వారిందరికీ ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పేదవారి కోసం ఇళ్ల స్థలాలు అడిగితే కేసులు పెట్టారని, లాఠీ దెబ్బలకైనా, తూటాలకైనా, కేసులకైనా సీపీఐ భయపడదని అన్నారు. ప్రభుత్వం పేదలకు పట్టాలు ఇచ్చేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. రామస్వామి, కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సుభాన్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ చారి, బీకేయూ జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి మండలాల ప్రధాన కార్యదర్శులు సత్తిరెడ్డి, సుధీర్, శ్రీనివాస్, జంగయ్య, మండల మహిళా అధ్యక్షురాలు వడ్ల మంజుల, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు శివ తదితరులు పాల్గొన్నారు.

'రామచంద్ర మిషన్' సేవలు అమోఘం

- కేంద్రమంత్రి దేవుసింగ్ జెసింగ్‌భాయ్ చౌహాన్
- కన్హా శాంతివనంలో రామచంద్ర జీ జయంతి
- బాబూజీ మహరాజ్ స్మారకార్థం పోస్టల్ స్టాంప్ విడుదల



పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేస్తున్న కేంద్రమంత్రి దేవుసింగ్ జెసింగ్‌భాయ్ చౌహాన్, గురూజీ కమలేష్ డి పటేల్

నందిగామ, ఫిబ్రవరి 14: రామచంద్ర మిషన్ సంస్థ దేశవ్యాప్తంగా చేపడుతున్న సేవలు అమోఘమని, ఆ సంస్థ చేపట్టే కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్రమంత్రి దేవుసింగ్ జెసింగ్‌భాయ్ చౌహాన్ అన్నారు. రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ రెండవ గురువు బాబూజీ మహరాజ్ 125వ జయంతితో పాటు సంస్థ ఆదిగురువు లాలాజీ మహరాజ్ 151వ జయంత్యుత్సవాలు నందిగామ మండలం కన్హా శాంతివనంలోని ధ్యాన కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూజీ మహరాజ్ పేరుతో పోస్టల్ స్టాంప్‌ను కేంద్రమంత్రి చౌహాన్ రామచంద్ర మిషన్ గురూజీ, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలేష్ డి పటేల్(దాజీ)తో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి దేశవిదేశాలతో పాటు భారత్‌లోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20వేల మంది ధ్యాన అభ్యాసకులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి దేవుసింగ్ మాట్లాడుతూ బాబూజీ మహరాజ్ ప్రజలందరూ మంచి మార్గంలో నడిచేందుకు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ఆధ్యాత్మికత, ధ్యానంతో ఏదైనా సాధించవచ్చని లాలాజీ మహరాజ్, బాబూజీ మహరాజ్‌లు నిరూపించారని అన్నారు. ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు శక్తి లభిస్తుందన్నారు. అంతకుముందు రామచంద్ర మిషన్ గురూజీ కమలేష్ డి పటేల్‌తో కలిసి మంత్రి ధ్యానం చేశారు. గురూజీల జయంతి సందర్భంగా అభ్యాసకుల సందడి పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు నాలుగు సిట్టింగులుగా 30 నిమిషాల పాటు ధ్యానం చేసారు. ఈ కార్యక్రమంలో రామచంద్రమిషన్ ప్రతినిధులు, అభ్యాసకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువులు : జేడీఏ



స్టాకును పరిశీలిస్తున్న గీతారెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 14 : జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నాగర్‌గూడ, షాబాద్‌లలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. షాపులోని ఎరువులు, స్టాక్ రిజిస్టర్లు, ఈ పాస్ యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువుల డీలర్లు కృత్రిమ కొరత సృష్టించవద్దని. ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువులను విక్రయించాలన్నారు. డీలర్లు రైతులకు సరిపడా ఎరువుల నిల్వలను మెయింటెన్ చేయాలని, ఎలాంటి కొరత రాకుండా చూడాలన్నారు. డీలర్లు ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా పాటించాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వెంట చేవెళ్ల ఏడీఏ రమాదేవి, మండల వ్యవసాయాధికారి వెంకటేశం తదితరులున్నారు.

పుట్టినరోజే.. కాటేసిన మృత్యువు

- అనారోగ్యంతో కన్నుమూసిన విద్యార్థి
- చటాన్‌పల్లి బీసీ హాస్టల్‌లో విషాదం
- బాలుడి స్వగ్రామం వికారాబాద్ జిల్లా కళ్లపల్లి
- గ్రామంలో నెలకొన్న విషాదచాయలు

షాద్‌నగర్/షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 14 : అమ్మా.. నాన్న.. రేపు నా పుట్టిన రోజు.. మీరు తప్పకుండా నా కోసం రావాలి. నాకు కూడా మిమ్మల్ని చూడాలని ఉందంటూ ఆ విద్యార్థి ఎంతో ఆనందంగా తల్లిదండ్రులతో ఫోన్ చేసి మాట్లాడాడు. తప్పకుండా వస్తాం బిడ్డా.. నీ కోసం కొత్తబట్టలు కూడా కొన్నాం.. రేపు హాస్టల్‌కి వస్తాం అని ఆ తల్లిదండ్రులు ఎంతో ప్రేమగా బదులిచ్చారు. కానీ, పుట్టినరోజే మృత్యువు తనపై గురిపెట్టిందన్న విషయం ఆ బాలుడికి తెలియదు పాపం. తీవ్ర అనారోగ్యంతో ఆ బాలుడు తనువు చాలించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ శివారులోని చటాన్‌పల్లి సంక్షేమ వసతి గృహం(బీసీ)లో బుధవారం చోటు చేసుకుంది. ఇప్పటివరకు తమతో కలిసి తిరిగిన స్నేహితుడు తిరిగిరాని లోకానికి వెళ్లడంతో వసతి గృహంలోని తోటి విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కళ్లపల్లి గ్రామానికి చెందిన శేఖర్, మమతల కుమారుడు దివ్యకాంత్(12) విద్యాభ్యాసం కోసం ఐదు నెలల క్రితం షాద్‌నగర్ పట్టణ శివారు చటాన్‌పల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే వసతి గృహంలో చేరి 5వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో దివ్యకాంత్ బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు వ్యాయామం కోసం వసతి గృహం నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన హౌస్‌మాస్టర్ హబీబ్ వెళ్లి చూశాడు. అప్పటికే దివ్యకాంత్ రక్తంతో కూడిన మల విసర్జన చేయడం, తాను పడుకున్న బెడ్ కూడా మొత్తం రక్తపు మరకలతో ఉండటం చూసిన హబీబ్ వెంటనే పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. అయితే, అప్పటికే విద్యార్థి స్పృహ కోల్పోయి ఉండటంతో వైద్యసిబ్బంది కొద్దిసేపు సీపీఆర్ చేశారు.

ఫలితం లేకపోడంతో కొద్దిసేపటి తర్వాత ఆ విద్యార్థి మరణించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు బోరున విలపించారు. వారి స్వగ్రామం కళ్లపల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి. పుట్టినరోజునే బాలుడిని మృత్యువు కబళించిందని బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు.



దివ్యకాంత్ (ఫైల్)

నివేదిక తర్వాతనే వివరాలు వెల్లడిస్తాం : హాస్పిటల్ సూపరింటెండెంట్

ఆరోగ్యంగా ఉన్న బాలుడు ఉన్నఫళంగా ఎందుకు రక్తపు విరేచనాలు చేసుకుని మరణించాడో తెలియడం లేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇంతకుముందు ఆ బాలుడికి ఏదైనా వ్యాధి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. విద్యార్థి తల్లితండ్రులను ఈ విషయం గురించి అడిగినా ఎలాంటి జబ్బు లేదని చెప్పినట్లు ఆయన తెలిపారు.

పోస్టుమార్టరం నివేదికను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని, వివరాలు వచ్చిన తర్వాత అసలు విషయం తెలుస్తుందని సూపరింటెండెంట్ చెప్పారు. కాగా, సీసీ కెమెరా పుటేజీ ప్రకారం.. అర్ధరాత్రి ఆ బాలుడు కొంత అస్వస్థతకు గురైనట్లు గుర్తించామని, ఆ తర్వాత అతడు నిద్రకు ఉపక్రమించిన విషయం కూడా కెమెరాలో నిక్షిప్తమైందని టౌన్ సీఐ ప్రతాప్‌లింగ్ తెలిపారు.


ఉర్సుకు డీఎస్పీ, సీఐలకు ఆహ్వానం


డీఎస్పీ శేఖర్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న వెంకటేష్, ఉర్సు నిర్వాహకులు

బషీరాబాద్, ఫిబ్రవరి 14: బషీరాబాద్‌లో ఈ నెల 20, 21, 22 తేదీల్లో నిర్వహించే హజ్రత్ శంషాఖాద్రీ దర్గా ఉర్సుకు రావాలని దర్గా కమిటీ నిర్వాహకులు బుధవారం తాండూరు డీఎస్పీ, సీఐలకు ఆహ్వానాలు అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో కమిటీ నిర్వాహకులు మునీర్, ఖాలీద్ పోలీసు అధికారులకు ఆహ్వాన పత్రిక ఇచ్చారు.

పంపకాలకు వేళాయే!

- ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు
- 19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు
- తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11.356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో గత నెలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారులతో కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అనంతరం ఉమ్మడి ఆస్తుల విభజనపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరిసమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

58:42 నిష్పత్తిలో పంపకాలు..

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. కాగా, భవన్ పంపకాలలో ఏపీకి 58.32శాతం, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పటౌడీ హౌస్‌లోని 5.245 ఎకరాల్లో నూతన తెలంగాణ భవన్ నిర్మించేందుకు సిద్ధమవుతోంది.



తమ సోదరుడి పాడె మోస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రవి

సోదరుడికి కన్నీటి వీడ్కోలు పలికిన భట్టి

- పాడె మోసి నివాళులు

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఆయుష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి ఆయన పాడె మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ముందు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్థుల సందర్శనార్థం అక్కడ ఉంచారు. ఆ తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు

- మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు 95 మంది డీఎస్పీలకు స్థానచలనాలు
- జీహెచ్‌ఎంసీలో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 114 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఉత్తర్వులిచ్చింది. మంగళవారం 40 మంది కమిషనర్లను బదిలీ చేయగా బుధవారం మరో 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రధానంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మునిసిపల్ కమిషనర్ల బదిలీ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏళ్లుగా జీహెచ్‌ఎంసీ పరిధిలో తిష్టవేసిన పలువురు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్ డీఏవోగా అభిమన్యు, భద్రాద్రి కొత్తగూడెం డీఏవోగా బి.బాబూరావు, సూర్యాపేట డీఏవోగా శ్రీధర్‌రెడ్డిని నియమించారు. పలు డివిజన్లకు ఏడీఏలను కూడా మార్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సివిల్, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 95 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 110 మంది డీఎస్పీలు బదిలీ కాగా రెండో జాబితాలో మరో 95 మందిని బదిలీ చేశారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రేపు సార్వత్రిక సమ్మె

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు, రైతుసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చాయని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల తరఫున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పోటు రంగారావు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) చలపతిరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రజాహిత యాత్రలో బండి సంజయ్

'కాళేశ్వరం' బాధ్యులను ఎందుకు అరెస్టు చెయ్యలే?

- ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అంతేకాక, ఎన్నికల టికెట్ కోసం కన్నకొడుకు పేరునే మార్చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కేటీఆర్ అసలు పేరు కల్వకుంట్ల అజయ్‌రావు అని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో బండి సంజయ్ బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకున్న కేసీఆర్.. అజయ్‌రావును తీసుకెళ్లి మీ పేరే పెట్టుకున్నానని ఆయనకు చెప్పి టికెట్ తెచ్చుకున్న మోసగాడు కేసీఆర్ అని విమర్శించారు. అబద్ధాలు, మోసాల్లో కేటీఆర్ అయ్యను మించిపోయాడని ఎద్దేవా చేశారు. అయ్య(కేసీఆర్) ఏక్ నంబర్ అయితే కొడుకు(కేటీఆర్) దస్ నంబరని అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1,408 కోట్లు నిధులు ఇచ్చిందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే రాముడికి ఓటు వేసినట్లేనని తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం న్యాయమా? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని, ఎన్నికల కోడ్ నెపంతో ఆ పార్టీ నేతలు తప్పించుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో 2 లక్షల మందికి 'ముఫ్త్ బిజిలీ'!

(మొదటి పేజీ తరువాయి)

యూనిట్ల వినియోగం	సోలార్ ప్లాంట్	వ్యయం	కేంద్రం సబ్సిడీ	వినియోగదారుడు భరించాల్సింది
0-100	1 కిలోవాట్	రూ.60 వేలు	రూ.30 వేలు	రూ.30 వేలు
150	2 కిలోవాట్లు	రూ.1.10 లక్షలు	రూ.60 వేలు	రూ.50 వేలు
300	3 కిలోవాట్	రూ.1.65 లక్షలు	రూ.78 వేలు	రూ. 87 వేలు

తొలిదశలో భాగంగా 34,59,585 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రధాని మోదీ ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజన రాష్ట్రంలో సంపూర్ణంగా అమలయితే దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వంపై గృహజ్యోతి భారం స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, ప్రతీ నెల 150 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంది. దీనికి రూ.1.10 లక్షలు వ్యయం కానుండగా... రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.50 వేలు సొంతంగా పెట్టుకోవాలి. 150 యూనిట్ల విద్యుత్ వాడకానికి నెలకు రూ.700 దాకా బిల్లు వచ్చే అవకాశం ఉండగా... సోలార్ యూనిట్‌తో రూ.625 మేర ఆదా అవుతుందని, బిల్లు కేవలం రూ.75 మాత్రమే చెల్లించే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర పథకం కింద రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పు మీద) సోలార్ యూనిట్లు పెట్టుకుంటే... వేసవిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విద్యుత్‌ను సొంతంగా వాడుకోవచ్చు లేదా డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. చీకటిపడ్డాక సౌరవిద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది కాబట్టి ఆ సమయంలో బ్యాటరీలో నిల్వ చేసిన కరెంట్‌ను లేదా డిస్కమ్‌లు సరఫరా చేసే కరెంట్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. కాగా, వినియోగదారుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధరను కేంద్రం ఖరారు చేయనుంది.

ముఫ్త్ బిజ్లీ యోజన

ముఫ్త్ బిజ్లీ యోజనలో ఒక కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువ కిలోవాట్ సోలార్ ప్లాంట్లకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

భారీగా పెరిగిన సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో కేంద్రం 3 కిలోవాట్లదాకా 40 శాతం సబ్సిడీ ఇస్తుండేది. అయితే, క్రమేణా దీనిని తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున 3 కిలోవాట్లకు రూ.54 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. 3 కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల దాకా కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇక అపార్టుమెంట్లు వంటి గ్రూప్ హౌసింగ్‌కు కిలోవాట్‌కు రూ.9 వేల దాకా సబ్సిడీ లభిస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజనలో సబ్సిడీని భారీగా పెంచారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం http://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత ఇంటి పైకప్పు మీద సోలార్ యూనిట్ పెట్టుకోవచ్చు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 80 మంది, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో 82 మంది సోలార్‌ప్లాంట్ విక్రేతలు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన 36 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెం టౌన్/వైరా/సూర్యాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొత్తగూడెం, సూర్యాపేట మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌తో పాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నో హై డ్రామాల మధ్య సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్‌ఎస్ నిలబెట్టుకున్నప్పటికీ బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం చేజారిపోతున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఆశించిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను, ఆమె భర్త దిలీప్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బీఆర్‌ఎస్ ఖాళీ కావడం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఎల్‌ఆర్

మహేశ్వరం, ఫిబ్రవరి 14 : కాంగ్రెస్ గాలికి మహేశ్వరంలో బీఆర్‌ఎస్ ఖాళీ కావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటూ, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విజయఢంకా మోగించేలా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహేశ్వరం గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ సభ్యుడిగా సేవలందించిన కూన యాదయ్యతో పాటు మాజీ ఉపసర్పంచులు దోమశ్రీనివాస్‌రెడ్డి, కర్రోళ్ల రాము, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం తుక్కుగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి లక్ష్మారెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరవేయడంలో కార్యకర్తలు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. మాజీ ఎంపీపీ కె. రఘుమారెడ్డి, కాకి ఈశ్వర్‌ముదిరాజ్, కె. పరమేష్, నయూమ్, జావీద్, కుమార్, జి. జంగయ్య, అంజయ్య, యాదయ్య, రాజు, నర్సింహ, మైసయ్య పాల్గొన్నారు.

కాళేశ్వరం అవినీతి గురించి మూడేళ్ల క్రితమే చెప్పా

- మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరుగుతోందని, నిర్మాణంలో నాణ్యతను కూడా పాటించడం లేదని తాను మూడేళ్ల క్రితమే చెప్పానని చేవెళ్ల మాజీ ఎంపీ, బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. నాడు తన మాటలు ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. బుధవారం మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ చౌరస్తాలో బీజేపీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గస్థాయి కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం దేశంలోనే ఓ భారీ కుంభకోణమని, దాని నిర్మాణంలో నాణ్యతను పాటించలేదని పలు వేదికలు తెలిపినట్లు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతోనే కేసీఆర్ ప్రజల దృష్టిని మరల్చేందుకు కృష్ణాజలాల పంపకాల విషయంపై తప్పుడు విషయాలను చెబుతున్నారని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కేఆర్‌ఎంబీపై చర్చ పెట్టాయని విమర్శించారు. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండాను ఎగరవేయడం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. బీజేపీ చేవెళ్ల కన్వీనర్ మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భీమేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తూర్పు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు జ్ఞానేశ్వర్, రాజేశ్వర్, మధు, బట్టు రాజమల్లేష్, పెంటయ్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అక్రమాలపై ఫిర్యాదు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 14 : మున్సిపాలిటీలో కొంతకాలంగా జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బుధవారం ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి, సీడీఎంఏ కార్యాలయాల్లో ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు వెలుగుచూసినా అధికారులు మాత్రం కంటితుడుపు చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని ఫిర్యాదు చేశామని చెప్పారు. మున్సిపాలిటీ సిబ్బంది వసూలు చేస్తున్న పన్నుల నగదును వారి ఇష్టానుసారంగా సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నట్లు ఆరోపించారు. ఈ విషయం మున్సిపల్ ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో మున్సిపాలిటీలో జరిగిన నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

జేఈఈ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ బల్‌రాం

కొడంగల్, ఫిబ్రవరి 14 : జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో కొడంగల్ మండలంలోని పాత కొడంగల్ గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాల ప్రారంభమైన మొదటి బ్యాచ్‌లోనే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం హర్షనీయమని ప్రిన్సిపాల్ బల్‌రాం అన్నారు. ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎంపీసీ విద్యార్థులు కిషన్ (65.89%), రాహుల్‌చౌహాన్ (59.67 %), అకిల్ (52.13 %), నవీన్ (49.57 %)లను అధ్యాపకులు అభినందించారు.

జాగ్రత్తలతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

- జిల్లా ఎస్పీ కోటిరెడ్డి



ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 14 : భద్రత నియమాలను ప్రతీ ఒక్కరూ పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా ఎస్పీ కోటి రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా బుధవారం పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వాహనదారులకు నియమాలపై అవగాహన కలిగించారు. ఒకరి నిర్లక్ష్యం ఇంకొకరికి శాపంగా మారుతుందని చెప్పారు. రోడ్డు భద్రత నియమాలను పాటించకుంటే అయితే రోడ్లు యమపాశాలుగా మారే అవకాశం ఉందని అన్నారు. కుటుంబ సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టి తమ వారు బయటకు వెళ్లే సమయంలో రోడ్డు భద్రత నియమాలను తప్పని సరిగా పాటించేటట్లు చూడాలని చెప్పారు. మైనర్‌లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని, వారు వాహనాలతో పట్టుబడితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. లైసెన్స్‌లేని వారికి వాహనాలు ఇస్తే ఆ యజమానుపైన కూడా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, 4వీలర్స్ వారు సీట్‌బెల్ట్ పెట్టుకొనే వాహనాలు నడపాలన్నారు. డ్రంక్ డ్రైవ్ చేయకూడదని, అలా చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు నడిపే వారి దగ్గర అన్ని పత్రాలు ఉండాలని చెప్పారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



కడ్తాల : ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 26 : మండల పరిధి శెట్టిపల్లి గ్రామంలోని శ్రీ అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు కొనసాగే ఈ బ్రహ్మోత్సవాలకోసం ఆలయాన్ని శోభాయామానంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం స్థానిక మాజీ సర్పంచ్ గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ కోట్ల జగన్‌మోహన్ ఆధ్వర్యంలో వసతులు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా తొలిరోజు అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవతో అర్చకులు మొల్లూరి నవీన్‌శర్మ, గూడ కృష్ణమాచార్యులు మేలుకొలుపు పాడారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పన, దీక్షారాధన నిర్వహించారు.



ఆమనగల్లు : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల : మండలంలోని మక్తమాదారం వేణుగోపాల స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఆలయ ధర్మకర్త వింజమూరి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో నిత్యనిధి, ఆదివాసం, హోమం, ధ్వజారోహణం, గరుడ సేవ, భేరిపూజ, బలిహరణం, పల్లకిసేవను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ ఆమనగల్లు అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ సర్పంచ్ సులోచనసాయిలు, ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, అర్చకులు ఆదిత్యాచారి, రంగాచారి, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలి

- ఏపీజీవీబీ నాగర్‌కర్నూల్ ఆర్‌ఎం రంజిత్



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌ఎం రంజిత్

మాడ్గుల, ఫిబ్రవరి 14 : ప్రతీ ఒక్కరు బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని ఏపీజీవీబీ నాగర్‌కర్నూల్ రీజినల్ మేనేజర్ రంజిత్ వారనాసి అన్నారు. మాడ్గుల మండలంలోని ఇర్విన్ గ్రామంలో బుధవారం ఏపీజీవీబీ నూతన బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ఖాతాదారులందరు పీఎంజేజేబీవై, పిఎంఎస్‌బీవైని కలిగి ఉండాలన్నారు. రైతులు తీసుకున్న వివిధ రకాల రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలను పొందాలని అన్నారు. పంట రుణాలను చెల్లించని వారు ప్రస్తుతం బ్యాంకు ఇస్తున్న కెసీసీ, ఓటిఎస్‌ని సద్వినియోగం చేసుకుని రుణ విముక్తులు కావాలని సూచించారు. మాజీ జడ్పీటీసీ పగడాల రవి, ఎస్‌ఎం ఆపరేషన్స్ గౌతమ్‌రెడ్డి, ఓమ్‌కార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలు రద్దు

- కొత్త కమిటీల ఏర్పాటుకు కసరత్తు
- ఆశావహుల ప్రయత్నాలు



బషీరాబాద్ : వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మేడ్చల్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వం నియమించిన మార్కెట్ పాలకవర్గాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో పాటు కొత్త పాలకవర్గాల ఏర్పాటుకు సన్నాహాలు చేసుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించారు. ఇందులో భాగంగా తాజాగా మేడ్చల్ మార్కెట్ కమిటీకి ఉత్తర్వులు వెలువడ్డాయి. కొత్త పాలకవర్గం ఏర్పాటుపై నేతలు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం అధికారికంగా పాలకవర్గాలు రద్దు కావడంతో కొత్త పాలకవర్గానికి చెందిన ప్రతిపాదనలు పంపించేందుకు మార్గం సుగమం అయింది. జిల్లాలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవుల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. అనేక మంది నేతలు మార్కెట్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పదవి పొందాలంటే మార్కెట్ పరిధిలోని గ్రామానికి చెందిన రైతులు అయి ఉండాలి. ఇప్పటికే పలువురు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. గతంలో మాదిరిగా పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తే ఇప్పటికే ఖరారైన రిజర్వేషన్ ప్రకారం పదవి కేటాయించే అవకాశం ఉంది. అయితే గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్లపై స్పష్టత రావాల్సి ఉంది. పదేళ్లుగా పదవులులేని కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అదృష్టం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

బషీరాబాద్ : బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ వ్యవసాయ, సహకారశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని మార్కెట్ కమిటీ కార్యదర్శి లక్ష్మణ్ బుధవారం ధ్రువీకరించారు. నూతన పాలకవర్గం నియామకం జరిగే వరకు రంగారెడ్డి జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయదేవికి పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.

నేడు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన

వికారాబాద్, ఫిబ్రవరి 14 : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఈ రోజు ఉదయం 10 గంటలకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని పరిశ్రమలశాఖ జిల్లా జనరల్ మేనేజర్ వినయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వతహాగా తయారు చేసిన ఉత్పత్తులు, హస్తకలలను ప్రోత్సహించడమే ఈ పథకం ముఖ్యోద్దేశమని ఆయన చెప్పారు. సంప్రదాయ వృత్తులు చేస్తున్నవారు తమ వృత్తులలో ఆధునిక ఉపకరణాలు, నైపుణ్యం, వృత్తి కళాకారులు, హస్త, కళాకారులను మరింత అభివృద్ధి చేయడం కోసం, అవగాహన పెంపొందించడానికి ఈ పథకం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సదస్సులో సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొంటున్నారని, కుమ్మరులు, విశ్వబ్రాహ్మణులు, స్వర్ణకారులు, శిల్పులు, కమ్మరులు, వివిధ సంప్రదాయ చేతివృత్తుల వారు, హస్త కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మతతత్వ విధానాలను ప్రతిఘటించాలి

- ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దత్తునాయక్



కరపత్రాలను విడుదల చేస్తున్న..

మహేశ్వరం, ఫిబ్రవరి 14 : మతతత్వ విధానాలను దేశ ప్రజలు ప్రతిఘటించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. దత్తునాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మంఖాల్ పారిశ్రామిక వాడలో కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న మతతత్వ విధానాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ సంఘాలు, ఏకమై కార్పొరేట్ మతతత్వ విధానాలను, వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ఫిబ్రవరి 16 న సమ్మె చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచి పెడుతూ పేదల సమస్యలను గాలికొదిలేశారని మండి పడ్డారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. దేవేందర్, యాదగిరి, బహ్మాచారి, భారతి, కల్పన, నరసింహ, వెంకటేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డికి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక అందజేస్తున్న వేణుగోపాల్, జీఎల్ఎన్ రెడ్డి

సన్మార్గంతోనే దైవానుగ్రహం

కడ్తాల్, ఫిబ్రవరి 14: సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశ స్వామి ఆలయంలో ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ టి.వేణుగోపాల్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పాలాది ఆంజనేయులు, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డిలు బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించి రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను స్థానిక నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మైసిగండి మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు శ్యామ్‌సుందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బ్రహోత్సవాల ఆహ్వాన ప్రతికను నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిలకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు అందజేశారు.

ఎమ్మెల్యే నారాయణరెడ్డికి సన్మానం

ఆమనగల్లు : పట్టణంలోని కేడీఆర్ జూనియర్ కళాశాల మొదటి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు లింగం గౌడ్, వేణుగోపాల్ రెడ్డి, మహ్మద్ మూస, లక్ష్మణ్, విజయభాస్కర్ రెడ్డి, శంకర్, హరికిషన్‌రెడ్డి, మన్నె ఆనంద్‌కుమార్, తదితరులు ఉన్నారు.

భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలి



మంచాల : బండలేమూర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న పోచమోని కృష్ణ, తదితరులు

మంచాల/యాచారం, ఫిబ్రవరి 14 : కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న కార్మిక, కర్షక సంఘాలు తలపెట్టిన భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ మంచాల మండల కన్వీనర్ పోచమోని కృష్ణ విజ్ఞప్తి చేశారు. సార్వత్రిక సమ్మె విజయవంతం కోరుతూ బుధవారం లోయపల్లి, చెన్నారెడ్డిగూడ, బండలేమూర్ గ్రామాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్యారపాండు, బోయపల్లి సుధాకర్, గంపల్లి రాజు, కృష్ణ, కుమార్, సాలమ్మ, పద్మమ్మ, రాములమ్మ, అంజమ్మ, సరోజ, రవి రమేష్, సత్తయ్య, బాబి తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదల బతుకులు బుగ్గిపాలు చేసిందని, నిత్యావసర సరకుల ధరలను రోజురోజుకూ పెంచుతుండటంతో పేదల బతుకులు ఛిద్రమవుతున్నాయని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి ఆందోళన వ్యక్త చేశారు. బుధవారం యాచారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఈనెల 16న జరిగే బంద్‌పై కరపత్రాలు అందించడంతో పాటు ఇల్లిల్లూ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. సీపీఎం నాయకులు కె.జగన్, సైదులు, జంగయ్య, చంద్రయ్య, పి. అంజయ్య, యాదయ్య, మొగులయ్య తదితరులున్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

- సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు
- చిన్నారులకు అక్షరాభ్యాసం

ఆమనగల్లు/కడ్తాల్ ఫిబ్రవరి 14 : ఆమనగల్లు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో వసంత పంచమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల అధ్యక్షుడు పాపిశెట్టి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఆర్ఆర్ఎస్ సభ్యులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వసంత పంచమిని పురస్కరించుకొని శ్రీ సరస్వతీదేవికి, భారత మాతకు పూజలు, యజ్ఞం నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. విద్యతోనే ప్రగతి సాధ్యమని రాము పేర్కొన్నారు. ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి చుక్క ఆనంద్, ప్రధానాచార్యులు గుత్తి కవిత, ఆచార్యులు స్వాతి, నాయకులు తదితరులున్నారు.



ఆమనగల్లు : వసంత పంచమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

ఆదిభట్ల : వసంత పంచమి పురస్కరించుకొని ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లోని శ్రీనివాస్ హైస్కూలులో శ్రీగణపతి, లక్ష్మి, సరస్వతీ హోమం నిర్వహించారు. 50 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి బాసరలోని సరస్వతీ మాతకు పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ హైస్కూలు చైర్మన్ లక్ష్మరాజు శ్రీనివాస్‌రావు, పిన్సిపల్ రాధిక, టీచర్లు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



షాబాద్ : నాగర్‌గూడ శ్రీచైతన్య స్కూళ్లో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు, తల్లిదండ్రులు

షాబాద్ : మండలంలోని శ్రీచైతన్య పాఠశాల, శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, రమేష్, చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

- ఏసీపీ, ఎంపీడీవోలు, తహసీల్దార్ల బదిలీలు
- అధికారులను సన్మానించిన సిబ్బంది, నాయకులు

మహేశ్వరం/కందుకూరు, ఫిబ్రవరి 14 : మహేశ్వరం మండల నూతన తహసీల్దార్‌గా పి.విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ విధులు నిర్వహించిన మహమూద్‌అలీని హెచ్ఎంఆర్ఎల్‌కు బదిలీ అయ్యారు. నగరంలోని హెచ్ఎంఆర్ఎల్ విభాగంలో విధులు నిర్వహించిన పి.విజయలక్ష్మిని మహేశ్వరం తహసీల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కందుకూరు మండల ఎంపీడీవో మంగళవారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్న బి.సరితను బుధవారం కార్యాలయ సిబ్బంది కలిశారు. సూపరింటెండెంట్ అత్తర్‌రహమాన్, సీనియర్ అసిస్టెంట్ పద్మ, జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్, ఏపీవో రవీందర్‌రెడ్డి, ఏపీఎం కవిత, ఉపాధి హామీ పథకం సిబ్బంది, అటెండర్లు పాల్గొన్నారు.

ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్‌గా వసంత

ఆమనగల్లు : ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్‌గా ఎన్.వసంత నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన శ్యామ్‌సుందర్ ను నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు బదిలీ చేశారు. జల్‌పల్లిలో పనిచేస్తున్న వసంతకు ఆమనగల్లుకు పోస్టింగ్ ఇచ్చారు. శ్యామ్‌సుందర్‌ను కాంగ్రెస్ జిల్లా కార్యవర్గసభ్యులు శ్రీశైలం సత్కరించారు.

జిల్లేడ్ చౌదరిగూడలో బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ జగదీశ్వర్

చౌదరిగూడ : జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎంపీడీవోగా ప్రవీణ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో మహేష్ బాబు వికారాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లగా వనపర్తి జిల్లా పెబ్బేర్ మండలంలో విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్ బదిలీపై వచ్చారు. అలాగే షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో ఏఏవోగా విధులు నిర్వహిస్తున్న జగదీశ్వర్ జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్ బదిలీపై నాగర్‌కర్నూల్ జిల్లా బదిలీపై వెళ్లారు.

కొత్తూరు మున్సిపల్ కమీషనర్‌గా ఎన్.బాలాజీ

కొత్తూరు : కొత్తూరు మున్సిపల్ నూతన కమిషనర్‌గా ఎన్.బాలాజీ నియమితులయ్యారు. ఇంతకు ముందు ఇక్కడ విధులు నిర్వహించిన వీరేందర్ చిట్యాల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. బాలాజీ ప్రస్తుతం నకిరేకల్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించినట్లు తెలిపారు.

నందిగామ ఎంపీడీవోగా సుమతి

నందిగామ/కొత్తూరు: నందిగామ మండల నూతన ఎంపీడీవోగా సుమతి బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన బాల్‌రెడ్డి మహబూబ్‌నగర్‌కు బదిలీపై వెళ్లారు. సుమతికి కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అదేవిధంగా కొత్తూరు మండల నూతన ఎంపీడీవోగా అరుంధతి నియమితులయ్యారు. కొత్తూరు ఎంపీడీవోగా విధులు నిర్వహించిన శరత్‌చంద్ర బదిలీ అయ్యారు.



కందుకూరు : ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సరితతో కార్యాలయ సిబ్బంది

శంషాబాద్ ఆర్జీఐఏ ఏసీపీగా కె.శ్రీనివాస్‌రావు

శంషాబాద్ : శంషాబాద్ ఆర్జీఐఏ ఏసీపీగా కె. శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇబ్రహీంపట్నం నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఏసీపీకి సీఐ బాల్‌రాజ్ పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కాగా, ఇంతకు ముందు ఇక్కడ ఏసీపీగా పనిచేసిన రాంచందర్ రావు డీజీ కంట్రోల్‌కు బదిలీపై వెళ్లారు.



శంషాబాద్ : ఏసీపీని సన్మానిస్తున్న సీఐ బాల్‌రాజ్

యాచారం తహసీల్దార్‌గా అయ్యప్ప

యాచారం : మండల తహసీల్దార్‌గా టి.అయ్యప్ప బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నందిగామ మండలం నుంచి బదిలీపై యాచారం వచ్చారు. ఇక్కడ పని చేసిన శ్రీకాంత్‌రెడ్డి యాదాద్రిభువనగిరి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

సీఐ, ఏఎస్సైకి ఘన సన్మానం

యాచారం మండల కాంగ్రెస్ నాయకులు మురళి బుధవారం బాధ్యతలు స్వీకరించిన సీఐ శంకర్‌కుమార్, ఏఎస్సైగా పదోన్నతి పొందిన జంగయ్యను ఘనంగా సత్కరించారు. ఎస్సైలు గోపాల్, వెంకటనారాయణ తదితరులున్నారు.

కేశంపేట ఎంపీడీవోగా వాణి

కేశంపేట : కేశంపేట ఎంపీడీవోగా జి.వాణి నియమితులయ్యారు. మేడ్చల్ మాల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట ఎంపీడీవోగా విధులు నిర్వహించిన జి.వాణి బదిలీపై కేశంపేటకు వచ్చారు. ఇదివరకు కేశంపేట మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రవిచంద్రకుమార్ రెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. వాణికి ఆమె కార్యాలయంలో సూపరింటెండెంట్ రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీవో నర్సింలు, పంచాయతీ కార్యదర్శులు స్వాగతం పలికి సన్మానించారు.

చేవెళ్ల ఏసీపీగా బంటు కిషన్

చేవెళ్ల : చేవెళ్ల నూతన ఏసీపీగా బంటు కిషన్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీ బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఏసీపీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. సీఐ లక్ష్మారెడ్డి, ఎస్సై వీరబ్రహ్మం, సిబ్బంది నాయకులు ఉన్నారు.



ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్‌గా బాలకృష్ణ

ఆదిభట్ల : ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.బాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అమరేందర్‌రెడ్డి వ్యక్తిగత పని నిమిత్తం దీర్ఘకాలిక సెలవులపై విదేశాలకు వెళ్లడంతో ఆయన స్థానంలో రంగారెడ్డి కలెక్టరేట్‌లో మెప్మా పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.బాలకృష్ణ ఆదిభట్ల కమిషనర్‌గా బదిలీపై వచ్చారు.

కడ్తాల ఎంపీడీవోగా సుజాత

కడ్తాల్ : కడ్తాల ఎంపీడీవోగా సుజాత బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి నుంచి సుజాత బదిలీపై కడ్తాలకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన రామకృష్ణ సంగారెడ్డికి బదిలీపై వెళ్లారు. ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీడీవోను మండల పరిషత్ సిబ్బంది, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, సత్కరించారు.

నందిగామ తహసీల్దార్‌గా రాజేశ్వర్

నందిగామ : నందిగామ నూతన తహసీల్దార్‌గా రాజశేఖర్ నియమితులయ్యారు. ఈమేరకు ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ విధులు నిర్వహించిన అయ్యప్ప బదిలీపై రంగారెడ్డి కలెక్టరేట్‌కి బదిలీపై వెళ్లారు. కొత్తూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన జానకి బదిలీ కావడంతో ఆమె స్థానంలో రవిందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి

కేశంపేట, ఫిబ్రవరి 14 : విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని కాకునూర్ గ్రామ శివారు నీల్యానాయక్ పౌల్ట్రీ ఫారంలో బుధవారం చోటుచేసుకుంది. కేశంపేట ఎస్సై కొప్పుగిరి లింగం కథనం ప్రకారం.. బిహార్‌లోని కతియార్ జిల్లా రంజిత గ్రామానికి చెందిన సునోర్ మాజీ(35) అనే కార్మికుడు 45 రోజుల క్రితం తెలంగాణకు వలస వచ్చాడు. కాంట్రాక్టర్ ద్వారా పౌల్ట్రీఫాంలో పనికి కుదిరాడు. కాగా, పౌల్ట్రీని ఫరూఖ్‌నగర్ మండలం బుచ్చిగూడకు చెందిన మక్కపాటి మల్లేశ్వరరావు లీజుకు తీసుకుని నడిపిస్తున్నాడు. అందులో పనికోసం వచ్చిన సునోర్ మాజీ రోజూమాదిరిగా కోళ్లదాణ తయారీలో నిమగ్నమయ్యాడు. మిక్సర్ వద్ద షార్ట్‌సర్క్యూట్ రావడంతో సునోర్ మాజీ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి కార్మికులతో సమాచారం అందుకున్న మల్లేశ్వరరావు కేశంపేట పోలీసులకు సమాచారం అందించారని ఎస్సై లింగం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

కొందుర్గు, ఫిబ్రవరి 14 : ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని టేకులపల్లిలో ఆలస్యంగా వెలుగుచూసింది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం మేరకు.. టేకులపల్లికి చెందిన బుడ్డోళ్ల జంగయ్య ఈ నెల 8న హైదరాబాద్‌కు కూలి పని నిమిత్తం వెళ్లాడు. 10వ తేదీ రాత్రి 9.30 గంటలకు షాద్‌నగర్ రాగా.. సమయం మించి పోవడంతో బస్సులు లేవని, రేపు ఉదయం వస్తానని కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి తెలిపాడు. మరుసటి రోజు జంగయ్య గ్రామానికి రాకపోవడంతో, కుటుంబసభ్యులు తెలిపినవారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. జంగయ్య ఇంటి నుంచి వెళ్లే సమయంలో తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించాడని తెలిపారు. బుధవారం ఆయన కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెప్పారు.



జంగయ్య(ఫైల్)

పోగొట్టుకున్న 10 సెల్‌ఫోన్ల రికవరీ

ఆదిభట్ల, ఫిబ్రవరి 14 : చోరీకి గురైన పది సెల్‌ఫోన్లను రికవరీ చేసిన ఆదిభట్ల పోలీసులు బుధవారం బాధితులకు అందజేశారు. వివిధ సందర్భాల్లో చోరీకి గురైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వాటిని కనుగొని స్వాధీనం చేసుకున్నామని సీఐ రాఘవేందర్ రెడ్డి చెప్పారు. ఎస్ఐ కృష్ణయ్య, హెడ్‌కానిస్టేబుల్ రాము ఉన్నారు.

నాలుగున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కొందుర్గు, ఫిబ్రవరి 14: అక్రమంగా తరలిస్తున్న నాలుగున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యంను పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం మేరకు.. మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్‌లో బుధవారం ఉదయం ఓ మారుతి వ్యాన్ అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో గ్రామానికి పెట్రోలింగ్ కోసం వెళ్లిన కానిస్టేబుళ్లు శ్రీధర్‌రెడ్డి, శివకుమార్‌లు వ్యాన్‌ను వెంబడించి పట్టుకున్నారు. డ్రైవర్ బి.రాజ్‌కుమార్‌ను విచారించగా ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి ఎక్కువ ధరకు కోళ్లఫాం యజమానులకు విక్రయిస్తున్నట్లు చెప్పాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాల అనుమతి రద్దు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. బుధవారం ఆయన శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. వాహనాదారుల లైసెన్సలను రద్దు చేయడానికి ఆర్టీఏకు సిఫారసు చేస్తానని తెలిపారు. గ్రామాల్లో పదేపదే రేషన్ బియ్యం కోసం కొందరు దళారులు తిరుగుతున్నారని, వారిపై ఎన్ని కేసులు నమోదు చేసినా తిరిగి అదే పని చేస్తున్నారని చెప్పారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బియ్యం అమ్మేవారి రేషన్ కార్డు తొలగిస్తామని, బియ్యం అవసరం లేకుంటే స్వచ్ఛందంగా రేషన్ కార్డులను రద్దు చేసుకోవాలని కోరారు. రేషన్ అక్రమ రవాణకు ఉపయోగించే ఆటో యాజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



సీజ్ చేసిన ఆటోలను పరిశీలిస్తున్న డీటీ రఘునందన్

అమరుల త్యాగాలు మరువలేనివి



ఆమనగల్లులో : అమర వీరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సై బాల్‌రామ్‌నాయక్, తదితరులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 14: దేశ సేవ కోసం ప్రాణాలర్పించిన అమర వీర జవానుల త్యాగం ఎన్నటికీ మరువలేమని ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రామ్ నాయక్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఏబీవీపీ నగర కార్యదర్శి శివ ఆధ్వర్యంలో బుధవారం జమ్మూకశ్మీర్ రాష్ట్రంలోని పుల్వామాలో జరిగిన దాడిలో అమరులైన 43 మంది అమర జవానులకు నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ బాల్‌రామ్ నాయక్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, ఏబీవీపీ రాష్ట్ర నాయకులు లండం మల్లేశ్‌లు హాజరయ్యారు. అమరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్ఐ యాదయ్య, కళాశాల అధ్యాపకులు వెంకటేశ్, ఏబీవీపీ నాయకులు శివ, మల్లేశ్, అంజి, శంకర్, సుమన్, ఆంజనేయులు, కళాశాల విద్యార్థులు తదితరులున్నారు.

వీరజవాన్లను స్మరించుకోవాలి

చేవెళ్ల : దేశం కోసం ప్రాణాలర్పించిన జవాన్‌లను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని ఏబీవీపీ చేవెళ్ల కార్యదర్శి మహిపాల్ అన్నారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీచైతన్య కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పుల్వామా దాడుల్లో వీరమరణం పొందిన జవాన్ల చిత్రపటాలకు పూలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నందిని, శివ, కార్తీక్, తరుణ్, శివ, ప్రవీణ్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



చేవెళ్ల : వీర మరణం పొందిన జవాన్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజలకు మెరుగైన వసతుల కల్పన



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్, ఫిబ్రవరి 14: ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రజా పాలన ధ్యేయమని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. మండలంలోని మైసిగండి గ్రామంలో మండల పరిషత్ నిధుల నుంచి రూ.8 లక్షలతో చేపట్టే అంతర్గత మురుగు కాల్వ నిర్మాణం పనులను బుధవారం కమ్లీమోత్యానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద కడ్తాల మండలంలో 43 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 2.20 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సత్యం, మాజీ వార్డు సభ్యుడు జవహర్‌లాల్ నాయక్, నాయకులు శ్రీను, రాములు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి

తలకొండపల్లి, ఫిబ్రవరి 14: పంటల సాగులో రైతులు తగిన మెలకువలు పాటించాలని తలకొండపల్లి ఏవో రాజు తెలిపారు. సేంద్రియ ఎరువులు వాడి పంటలో దిగుబడులు పెంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. మండల పరిధిలోని వెల్జాల గ్రామంలో అంజయ్య, వెంకయ్య సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

పంటల నమోదు ప్రక్రియను సక్రమంగా చేపట్టాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి

చేవెళ్ల, ఫిబ్రవరి 14 : పంటల నమోదు ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో యాసంగి పంటల సాగు నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. అనంతరం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఏడీఏ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటల వివరాలను వ్యవసాయ శాఖ అధికారుల వద్ద నమోదు చేయించాలన్నారు. రైతులు పంటల సాగు వివరాలు నమోదు చేయించకపోతే ధాన్యం కొనుగోలు సమయంలో ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆమె తెలిపారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నందిగామ, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలో గ్రామానికి చెందిన తాండ్ర శ్యామ్‌సుందర్‌రెడ్డి జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు నూతనంగా నిర్మించిన సాయిబాబా ఆలయ మొదటి వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాతలు తాండ్ర రామకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి దంపతులు వేదపండితుల సమక్షంలో అభిషేకం, గణపతిపూజ, హోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే చేగూర్‌లోని సాయిబాబా ఆలయ 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ ఈట గణేష్, ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ వి. నారా యణరెడ్డి, ఎంపీటీసీలు కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్ ప్రజాప్రతినిధులు, నాయకులున్నారు.




నందిగామ సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దాతలు, ప్రతాప్‌రెడ్డి, తదితరులు

'ఉద్యమకారులను అణగదొక్కిన బీఆర్ఎస్'

షాబాద్, ఫిబ్రవరి 14 : ప్రత్యేక తెలంగాణ కోసం అలుపెరుగని పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్న తరువాత బీఆర్ఎస్ నాయకులు ఉద్యమకారులకు అణగదొక్కారని, ఎమ్మెల్యే కాలె యాదయ్య వైఖరితోనే పార్టీ వీడుతున్నానని పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్దూరి మల్లేష్ ఆరోపించారు. బుధవారం షాబాద్‌లో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ నెల 16న షాబాద్ మండలం నుంచి భారీఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నామన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య వైఖరి వల్లే తామంతా పార్టీ వీడుతున్నామని, యాదయ్య తమను పట్టించుకోలేదని, చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని, తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. పార్టీ కోసం, పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశామని అయిన గుర్తింపులేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ చెన్నయ్య, నాయకులు తమ్మలి రవీందర్, చెన్నయ్య, నర్సింహులు, వెంకట్‌రెడ్డి, సాయికృష్ణారెడ్డి తదితరులున్నారు.

పిల్లలకు విటమిన్ ఎ ద్రావణం తాగించాలి : ఎంపీపీ

యాచారం, ఫిబ్రవరి 14 : చిన్నపిల్లల ఎదుగుదలకు దోహదపడే విటమిన్ ఎ ద్రావణాన్ని ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని యాచారం ఎంపీపీ కొప్పు సుకన్య బాషా అన్నారు. బుధవారం యాచారం మండల కేంద్రంలోని పాఠశాలలో విద్యార్థులకు విటమిన్ ఎ ద్రావణం తాగించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విటమిన్ ఎ ద్రావణాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికి తాగించాలన్నారు. 9 నెలల నుంచి 5 ఏదేళ్ల వరకున్న బాలబాలికలకు తాగించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య తదితరులున్నారు.



బాలుడికి విటమిన్ ఏ ద్రావణం తాగిస్తున్న ఎంపీపీ కొప్పు సుకన్యబాషా

పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలి


మంచాల, ఫిబ్రవరి 14 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను నిరుపేదలకు అందేట్లు చూడాలని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండెమోని జయమ్మ పార్టీ శ్రేణులకు సూచించారు. మంచాల మండలం ఆగాపల్లికి చెందిన దూసరి లావణ్యను జిల్లా ప్రధానకార్యదర్శిగా, ఎల్.కల్పనను కార్యదర్శిగా నియమిస్తూ బుధవారం బాధ్యతలు నియామక పత్రాలు అందజేశారు. జయమ్మ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.



నియామక పత్రాలు అందుకుంటున్న లావణ్య, కల్పన

జేఈఈ మెయిన్స్‌లో మహేశ్వరం గురుకుల విద్యార్థినుల ప్రతిభ

కందుకూరు, ఫిబ్రవరి 14 : మండలంలోని గూడూరు గేటు వద్ద ఉన్న మహేశ్వరం గురుకులం (ఎస్సీ) విద్యార్థినులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఏడుగురు మెరుగైన ర్యాంకు సాధించారు. ఇటీవల జరిగిన పరీక్షలో పాఠశాలకు చెందిన 24మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ ఇ.లక్ష్మి తెలిపారు. అర్చన, సోనియా, అక్షిత, సింధు, నిహారిక, శ్రావణి, శషిత టాప్ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. బుధవారం వారిని అభినందించారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ లక్ష్మి

అఖిల్ యాదవ్‌ను సన్మానించిన మండలవాసులు

శంషాబాద్, ఫిబ్రవరి 14 : జేఈఈ మెయిన్స్-2024లో 99.89 ర్యాంకు సాధించిన శంషాబాద్ మున్సిపల్‌వాసి కె.అఖిల్ యాదవ్‌ను శంషాబాద్ మున్సిపల్, మండల నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి అఖిల్‌యాదవ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాజుయాదవ్, నరేందర్, అమరేందర్‌గౌడ్, జగన్‌గౌడ్‌తో పాటు అకడమిక్ డీన్ భరత్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి ప్రసాద్ తదితరులున్నారు.



అఖిల్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

సంక్షిప్తంగా..

- **చేవెళ్ల** : ఎన్ని చట్టాలు ఉన్న దళితులపై అఘాయిత్యాలు, దాడులు ఆగడం లేదని చేవెళ్ల అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్ వాపోయారు. శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడ గ్రామంలో దళితులపై, చర్చిపై ఆర్ఎస్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతల దాడులను తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా దళితులపై వివక్ష వేధింపులు జరుగుతున్నాయన్నారు.
- **మాడ్గుల** : మండలంలోని పెద్దమాడ్గుల సమీపాన గల స్వయంభు శివాలయం ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి హాజరయ్యారు. వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు.
- **యాచారం** : నిరుపేదల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందించి ఆదుకుంటామని బీజేపీ మండలాధ్యక్షుడు తాండ్ర రవీందర్ చెప్పారు. కుర్మిద్దతండాలో ఆయన గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రవీందర్ పార్టీ కార్యకర్తలతో కలిసి తండాలో పర్యటించి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. బీజేపీ నాయకులు ప్రవీణ్, మల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, రాజీవ్, వెంకటేష్ తదితరులున్నారు.
- **తలకొండపల్లి** : జాతీయ ఉపాధి హామి పథకం కింద తలకొండపల్లి మండలంలో 58 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 2.85 కోట్లు మంజూరైనట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీ రమేశ్ మాజీ సర్పంచ్ కాడేమోని శ్రీశైలం లు తెలిపారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో ఒక్కో రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున కేటాయించినట్లు వారు పేర్కొన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో ఈజీఎస్ నిధుల నుంచి రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను బుధవారం ప్రభాకర్ రెడ్డి, శ్రీశైలం , రమేశ్ లు ప్రారంభించారు.
- **మంచాల** : మోడల్‌స్కూల్ అధ్యాపకులు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు కనీస వేతనాలు మంజూరు చేయాలని టీపీయూఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి పూజరి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తపస్ ఆధ్వర్యంలో రూపొందించి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.